# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 346 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం ● 01, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఇండియన్ ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది



హైదరాబాద్ (నమస్తే ఉదయం):
ఇండియన్ ఆర్మీ చీఫ్‌గా జనరల్ ఉపేంద్ర ద్వివేది బాధ్యతలు స్వీకరించారు. 2022 మే నుంచి ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ మనోజ్ పాండే పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానాన్ని భర్తీ చేశారు.

జనరల్ ఉపేంద్ర ద్వివేది దీనికి ముందు ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా ఉన్నారు. పరమ విశిష్ట సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, మూడు జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్‌ఛార్జ్ కమెండేషన్ కార్డ్‌లను ఆయన అందుకున్నారు. కాగా, మధ్య ప్రదేశ్‌కు చెందిన ఉపేంద్ర ద్వివేది, సైనిక్ స్కూల్ రేవాలో చదివారు. 1981 జనవరిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీయే) లో చేరారు. 1984 డిసెంబర్‌లో జమ్ముకశ్మీర్ రైఫిల్స్ 18వ బెటాలియన్‌లో నియమితులయ్యారు. ఆ తర్వాత కశ్మీర్ లోయ, రాజస్థాన్ ఎడారు లలో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల బెటాలియన్‌కు నేతృత్వం వహించారు. మరోవైపు, ఇన్‌స్పెక్టర్ జనరల్ అస్సాం రైఫిల్స్, అస్సాం రైఫిల్స్ సెక్టార్ కమాండర్‌గా తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో ఉపేంద్ర ద్వివేది విశేష సేవలు అందించారు.



# రేవంత్ వినతి.. కేంద్రం సమ్మతి

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం):
రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు స్మార్ట్ సిటీస్ మిషన్ గడువును 2025 వరకు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నెలతోనే స్మార్ట్ సిటీస్ మిషన్ గడువు ముగియనుండగా, మరో ఏడాది పాటు 2025 మార్చి 31వ తేదీ వరకు గడువును కేంద్రం పెంచింది. ఈ నెల 24వ తేదీన ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రితో ఈ విషయమై భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే గడువు పెంచాలని సిఎం రేవంత్ కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగా కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

### వరంగల్, కరీంనగర్ నగరాల్లో స్మార్ట్ సిటీ పనులు

ప్రస్తుతం రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో స్మార్ట్ సిటీస్ మిషన్ పనులు కొనసాగుతున్నాయి. వరంగల్‌లో ఇప్పటివరకు 45 పనులు పూర్తి కాగా, రూ.518 కోట్లతో మరో 66 పనులు కొనసాగుతున్నాయి. కరీంనగర్‌లో 25 పనులు పూర్తి కాగా, మరో రూ.287 కోట్లకు సంబంధించిన 22 పనులు కొనసాగుతున్నాయి. స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ పనులు పూర్తయ్యే వరకు మిషన్ గడువు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిఎం కోరారు. సిఎం విజ్ఞప్తికి స్పందించిన

కేంద్రం స్మార్ట్ సిటీ మిషన్‌ను 2025 మార్చి 31 వరకు పొడిగిస్తూ రాష్ట్రాలకు లేఖ రాసింది. ఇప్పటికే నిధులు కేటాయించి ఆమోదించిన పనులను కొనసాగించాలని, కొత్త పనుల మంజూరు ఉండదని ఈ లేఖలో కేంద్రం స్పష్టం చేసింది. జరుగుతున్న పనులకు సంబంధించిన నిధులను ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఫస్ట్ కమ్ ఫస్ట్ పద్ధతిన విడుదల చేస్తామని కేంద్రం తెలిపింది. వీలైనంత త్వరగా ఈ పనులను పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇప్పటికే నిధులు కేటాయించి ఆమోదించిన పనులను కొనసాగించాలని ఈ లేఖలో కేంద్రం స్పష్టం చేసింది.

### స్మార్ట్ సిటీస్ మిషన్ పథకం

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 2015 జూన్ 25న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మిషన్ అమలు బాధ్యతను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా మొట్టమొదటగా వంద నగరాలను ఎంపిక చేశారు. ఈ వంద నగరాలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నుకున్నారు. ప్రధాన మౌలిక సదుపాయాలు, స్వచ్ఛమైన, స్థిరమైన పర్యావరణం, అధిక నాణ్యత గల జీవనాన్ని అందించే నగరాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పథకం ప్రవేశపెట్టారు. ఇప్పటికీ విజయవంతం అవుతోంది.

# రుణమాఫీకి ఢోకాలేదు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం):
ఆర్థిక అవసరాలు ఎన్ని ఉన్నా, ఇప్పటికే ఖజానాపై భారం తీవ్రంగా ఉన్నప్పటికీ కొత్తగా అప్పులు చేసే విష యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచీతూచీ అడుగులేస్తోంది. రాష్ట్ర ప్ర జలకిచ్చిన హామీలను నెరవేర్చేక్రమంలో రైతులకు పంట రుణాలను మాఫీ చేసేందుకు అవసరమైన నిధులను సమకూర్చుకునేందుకు ఆర్థి క శాఖ వ్యూహాత్మకంగా అడుగులేస్తోంది. ఆగస్టు 15వ తేదీ నాటికే పంట రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన నేపథ్యంలో అప్పటికి నిధులను సమకూర్చుకోవాలని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ఆర్థికశాఖాధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే జూలై నెలాఖరుకే నిధులు సమకూరే విధంగా ఆర్థిక శాఖాధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. పంట రుణాల మాఫీకి అవసరమైన 31 వేల కోట్ల రూపాయల నిధులను జూలై నెలాఖరుకల్లా ఖజానా లో ఉండేటట్లుగా ఏర్పాట్లు చేసినట్లుగా కొందరు సీనియర్ అధికారులు వివరించారు.

సెక్యూరిటీ బాండ్ల వేలంలో గత ఏప్రిల్ నెల నుంచి జూన్ నెలాఖరు వరకూ రిజర్వు బ్యాంకు నుంచి 16 వేల కోట్ల రూపాయల నిధులు వచ్చాయని, అందులో నుంచి సుమారు 10 వేల కోట్ల రూపాయల నిధులను పంట రుణాల మాఫీ కోసం రిజర్వు చేసిఉంచామని, దానికితోడు రాష్ట్ర ప్రభుత్వ విభాగాల నుంచి వచ్చే సొంత ఆదాయంలో నుంచి వచ్చే నిధులు, జూలై నెలలో సెక్యూరిటీ బాండ్ల వేలం నుంచి మరో ఏడు వేల కోట్ల రూపాయల నిధులు వస్తాయని, ఆగస్టు నెలలో మొదటి రెండు వారాల్లో కలిపి మరో రెండు వేల కోట్ల రూపాయల నిధులు ఆర్‌బిఐ నుంచి వస్తాయని, ఇలా అన్ని వైపుల నుంచి నిధుల సమీకరణ ప్రక్రియను పక్కా ప్రణాళికతో చేపట్టామని, అందుకే పంట రుణాల మాఫీకి ఎలాంటి ఢోకా లేకుండా ముఖ్యమంత్రి నిర్దేశించుకొన్న షెడ్యూలు ప్రకారమే రుణాల మాఫీ జరుగుతుందని ఆర్థికశాఖలోని అధికారులు వివరించారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకూ రెండో త్రైమాసికంలో సెక్యూరిటీ బాండ్ల వేలం నుంచి మరో 16 వేల కోట్ల రూపాయల నిధులను సమీకరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టగా అందుకు ఆర్‌బిఐ కూడా ఆమోదముద్ర వేసిందని తెలిపారు. మొదటి త్రైమాసికంలోని ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొన్ని పథకాలకు నిధులను ఖర్చు చేయకుండా నిలిపివేయాల్సి వచ్చిందని, దానికితోడు బిల్లుల చెల్లింపులను కూడా వాయిదా వేయడం జరిగిందని వివరించారు.




జిఎస్‌టి పన్నుల ఆదా మద్యం అమ్మకాలతో వచ్చిన ఎక్సైజ్ ఆదాయం, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల విభాగం, అటవీశాఖ, రవాణా శాఖ, గనుల శాఖ తదితర ఆదాయాన్ని స మకూర్చే విభాగాల నుంచి కూడా ఖజానాకు మెరుగైన ఆదాయమే వచ్చిం దని, అందుచేతనే భారీగా అప్పులు చేయాలనే ఆలోచనకు ఫుల్‌స్టాప్ పెట్టి ఎఫ్ఆర్‌బిఎం చట్ట ప్రకారమే రుణాల సేకరణకు పరిమితం కావాలని ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి (ఆర్థికశాఖామంత్రి) భట్టి విక్రమార్కలు ఒకేమాటగా చెప్పడంతోనే పెద్ద మొత్తాల్లో అప్పులు చేయడం లేదని ఆ అధికారులు వివరించారు. వాస్తవానికి బిజెపి పాలిత రాష్ట్రాల్లో మె జారిటీ రాష్ట్రాలన్నీ ఎఫ్ఆర్‌బిఎం పరిధిని దాటిపోయి ఆయా రాష్ట్రాల జిఎస్ డిపిలో 30 శాతం నుంచి 46 శాతం వరకూ అప్పులు చేశాయని, కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు కేవలం 27.8 శాతానికి పరిమితం అయ్యాయని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపూర్వం ఈ అప్పులు 28 శాతం ఉండేవని, ఇప్పుడు ఆ అప్పులు 27.8 శాతానికి తగ్గా యని ఆ అధికారులు వివరించారు. అంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 0.2 శాతం అప్పులు తగ్గాయని తెలిపారు. ఇలా పక్కా ప్రణాళికతో ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగుతోందని వివరించారు. రాష్ట్ర ప్రజలపై అదనంగా ఎలాంటి పన్నుల భారాన్ని మోపకుండా, ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ, దుబారా వ్యయాన్ని నియంత్రిస్తూ, హంగులు-ఆర్భాటా లకు పోకుండా, ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేయకుండా, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఆర్థిక వ్యూహంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఆర్థికశాఖ వర్గాలు సగర్వంగా చెబుతున్నాయి.



# మరో మూడు రోజులు భారీ వర్షాలు..

### జూన్‌లో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం):
బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 7.6 కి.మీ ఎత్తులో నైరుతి దిశగా కొనసాగుతుందని పేర్కొన్నది. అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఆదివారం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ముల్కపల్లేలో అత్యధికంగా 9.12 సెం.మీ, భద్రాచలంలో 7.33 సెం.మీ, జూలూరుపాడ్‌లో 6.26 సెం.మీ, చంద్రుగొండలో 6.15 సెం.మీ, కొత్తగూడెంలో 5.57 సెం.మీ, చుంచుపల్లిలో 5.32 సెం.మీ, అశ్వాపురంలో 5.51 సెం.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైన్‌పూర్‌లో 5.74 సెం.మీ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 5.61 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో 6.72 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

ఈ ఏడాది జూన్ ముగిసేటప్పటికీ 159 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం ఆదిలాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, మహబూబాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# ఆన్‌లైన్‌లో నీట్ యుజి?

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే ఉదయం):
దేశవ్యాప్తంగా వైద్య విద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) పరీక్షకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల ఆఫ్‌లైన్ విధానం లో నిర్వహించిన యుజిసి నెట్ పరీక్షను కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 4 వరకు ఆన్‌లైన్ విధానంలో యుజిసి నెట్ నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌ను కూడా ఎన్‌టిఏ ప్రకటించింది. నీట్ యుజి పరీక్షకు సంబంధించిన పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా




దుమారం రేపుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు కొత్త ఆలోచన చేస్తున్నది. నీట్ పరీక్షను పెన్, పేపర్ పద్ధతిలో ఆఫ్‌లైన్‌లో కాకుండా జెఇఇ తరహాలో ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం నీట్ పరీక్ష పెన్, పేపర్ విధానంలో జరుగుతున్నది. ఈ విధానంలో అభ్యర్థులు ఒఎంఆర్ షీట్‌లో తమ సమాధానాలను బబుల్ చేయాల్సి ఉంటుంది. అయితే నీట్‌లో అక్రమాలను అరికట్టేందుకు ఇకపై ఆన్‌లైన్ విధానమే సరైనదని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిసింది.

### కొవిడ్ సమయంలోనే ప్రతిపాదనలు

నీట్ యుజి పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని కొవిడ్ సమయంలోనే కేంద్రం పరిశీలించింది. జెఇఇ మెయిన్ తరహాలోనే నీట్ పరీక్షను కూడా ఒకటి కంటే ఎక్కువ సార్లు నిర్వహించాలని విద్యార్థుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. విద్యార్థులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తే బాగుంటుందని భావిస్తే, ఆ అంశా తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని అప్పటి కేంద్ర మంత్రి వెల్లడించారు.

# నేటి నుంచి కొత్త న్యాయచట్టాల అమలు

న్యూఢిల్లీ, జూన్ 30 (నమస్తే ఉదయం):
దేశంలో జులై 1 నుంచి మూడు కొత్త న్యాయచట్టాలు అమలులోకి వస్తున్నాయి. దాదాపు 150 ఏళ్లుగా అమలులో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పిసి), స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్ ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ) స్థానంలో భారతీయ సాక్ష అధినియం (బీఎస్ఏ) రాబోతున్న విషయం తెలిసిందే.

అయితే వీటిపై ఒకవైపు నిరసనలు వ్యక్తమవుతుండగా, మరోవైపు రాష్ట్రాల పోలీస్ యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే అనేక దశలుగా పోలీస్‌లకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా దర్యాప్తు, న్యాయ విచారణ చేసేందుకు కొత్త చట్టాలు ఊతమిస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

### కొత్త చట్టాల ప్రకారం...

1. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటనను ఫిర్యాదు చేయవచ్చు. దీంతో వేగవంతంగా చర్యలు తీసుకొనే వెసులుబాటు పోలీస్‌లకు లభిస్తుంది.
2. జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం ఏ వ్యక్తి అయినా పోలీస్‌స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. 14 రోజుల్లోగా దర్యాప్తు చేపట్టి కేసును కొలిక్కి తేవాలి.
3. అరెస్ట్ సందర్భాలలో బాధితుడు సన్నిహితులు, బంధు వులకు తన పరిస్థితిని తెలియజేసే హక్కు ఉంటుంది. తద్వారా బాధితుడు తక్షణ సహాయం పొందడానికి వీలవుతుంది.
4. అరెస్ట్‌ల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌తోపాటు జిల్లా ప్రధాన కేంద్రాల్లోనూ బహిరంగంగా ప్రదర్శిస్తారు. తద్వారా అరెస్ట్‌కు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని బాధితుల కుటుంబీకులు, స్నేహితులు తేలికగా తెలుసుకునే వీలుంటుంది.
5. హేయమైన నేరాల్లో ఇకనుంచి ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరి. ఏడేళ్లకు పైగా శిక్షపడే అవకాశం ఉన్న నేరాల్లో ఫోరెన్సిక్ నిపుణులు సంఘటన స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరిస్తారు. ఆ



సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరి. దీనివల్ల దర్యాప్తులో నాణ్యత, విశ్వసనీయత పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.
6. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పరిష్కారానికి కొత్త చట్టాల్లో అధిక ప్రాధాన్యమిచ్చారు. ఈ నేరాల్లో దర్యాప్తు రెండు నెలల్లో పూర్తి కావాలి. అంతేకాదు బాధిత మహిళలు , చిన్నారులకు ఉచిత ప్రాథమిక చికిత్స , వైద్య చికిత్సకు కొత్త చట్టాలు హామీ ఇస్తున్నాయి.
7. ఇక సమన్లు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా పంపించవచ్చు.
8. మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేని పక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి.
9. బాధితులతోపాటు నిందితులు కూడా ఎఫ్ఐఆర్ నకళ్లను ఉచితంగా పొందే వీలుంటుంది. వీటితో పాటు పోలీస్ రిపోర్టు, ఛార్జిషీటు, స్టేట్‌మెంట్లు, ఇతరడాక్యుమెంట్లను 14 రోజుల్లోగా పొందవచ్చు.
10. కేసు విచారణలో అనవసర జాప్యాన్ని నివారించడానికి, సకాలంలో న్యాయం అందేలా చేయడానికి, న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.
11. సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకుని, సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి.
12. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీస్‌లు నమోదు చేయాలి.
13. మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసు వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు తాము నివాసం ఉన్న చోటే పోలీస్‌ల సాయం పొందవచ్చు. 14. స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్థులకు సమాజ సేవ చేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి.
15. ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు, నేరం ద్వారా సంక్రమించిన సొమ్ముతో వారు కొన్న స్థిర, చరాస్తులనూ జప్తు చేసే అధికారం పోలీస్‌లకు ఉంటుంది.
16. సాక్షుల వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్ష్యాలన్నింటినీ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన డిజి లాకర్‌లో భద్ర పరుస్తారు.

క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్) ద్వారా ఇప్పటికే దేశ వ్యాప్తంగా అన్నిపోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేసినందున , సాక్ష్యాలను ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. డిజి లాకర్‌ను ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (ఐసీజేఎస్) కు అనుసంధానం చేస్తారు. పోలీస్‌లు, న్యాయవాదులు, న్యాయమూర్తులు అవసరమైనప్పుడు సాక్ష్యాలను పరిశీలించుకోవచ్చు. దీని వల్ల ఆధారాలు మాయం చేయడం సాధ్యం కాదు.

### సందిగ్ధ అంశాలు

ఈ చట్టాల అమలులో కొన్ని సరళమయ్యే అంశాలు ఉన్నప్పటికీ సందిగ్ధం అయ్యే అంశాలు కొన్ని ఉన్నాయి. ఏవైనా నేరాలు కొత్త చట్టం అమలు లోకి రావడానికి ముందు , అంటే 2024 జూన్ 30 కి ముందు మొదలై, అమలు లోకి వచ్చిన తరువాత అంటే 2024 జులై 1 తరువాత కూడా కొనసాగుతుంటే బహుళ నేరాలకు పాల్పడిన వ్యక్తులపై చివరి కేసు నమోదైన తేదీనే పరిగణన లోకి తీసుకోవాలి. 2024 జూన్ 30 లోపు నేరం జరిగి, జులై 1 తర్వాత అది బయటపడితే , నేరం జరిగిన సమయమే ప్రామాణికం. అంటే పాతచట్టం ప్రకారమే కేసు నమోదు చేయాలి.

దర్యాప్తు అధికారులు, న్యాయవాదులు, న్యాయస్థానాలను గందరగోళానికి గురిచేసే విషయమిది. పాత చట్టాల కింద నమోదైన కొన్ని కేసులు నెలల తరబడి దర్యాప్తు, కొన్నేళ్ల పాటు విచారణ జరిగే అవకాశం ఉంది. దీంతో దర్యాప్తు అధికారులు పాత, కొత్త చట్టాలపై సమగ్ర అవగాహనతో ఉండాలి. రెండు రకాల కేసులు కలిపి దర్యాప్తు, న్యాయ విచారణ జరిపేటప్పుడు, సంక్లిష్టత ఎదురయ్యే అవకాశం ఉంది.

పోలీస్ కంప్యూటర్ వ్యవస్థలో జులై 1 నుంచి కొత్త చట్టాలకు అనుగుణంగా మార్పులు చేసినందున , పాత కేసుల దర్యాప్తులో సమస్యలు తప్పక పోవచ్చని సిబ్బంది చెబుతున్నారు. చాలా రాష్ట్రాలో సీసీటీఎస్ఎస, ఐసీజెఎస్ పూర్తి కాలేదు. ఇటువంటి చోట పరిస్థితి ఏమిటన్నది స్పష్టత లేదు. దర్యాప్తు అధికారులు తమకు కావలసినప్పుడు పాత పత్రాలు, సాక్ష్యాల వంటివి డిజి లాకర్ ద్వారా ఎలా చూసుకోవాలన్న అంశం లోనూ స్పష్టత లేదు. చిన్నచిన్న నేరాలకు సామాజిక సేవలు చేయించడం వంటి శిక్షలు విధించవచ్చు. కానీ ఎలాంటి నేరాలకు ఎలాంటి శిక్షలు విధించాలన్న దానిపై స్పష్టత లేదు.

### చట్టాల అమలు వాయిదా వేయాలని పీయుసిఎల్ లేఖ

అయితే వీటివల్ల కొన్ని విషయాల్లో పోలీస్‌ల అధికారాలు మరింత పెరుగుతాయని, సామాన్యులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ కొత్త చట్టాల అమలును వాయిదా వేయాలని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్ ) కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు శనివారం లేఖ రాసింది. కొత్త చట్టాల తీరుతెన్నులు, ఈ చట్టాల అవసరం, ప్రవేశ పెట్టేందుకు అవకాశాలు తదితర అంశాలపై ముందు జాతీయ స్థాయిలో విస్తృతంగా చర్చ జరగాలని లేఖలో సూచించింది.

కేంద్రం మాత్రం ఈ చట్టాలపై ఎంతో విస్తృతంగా చర్చించామని, సభలో చర్చల సందర్భంగా అనేక మంది విపక్ష ఎంపీలు సస్పెండ్ అయ్యారని న్యాయశాఖ మంత్రి ఇటీవల వెల్లడించిన విషయాన్ని పీయుసిఎల్ తన లేఖలో ప్రస్తావించింది.

విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడమంటే ఆ చట్టాలపై వివరణాత్మక చర్చ జరగలేదన్న విషయాన్ని ఎత్తి చూపుతోందని పీయూసిఎల్ లేఖలో పేర్కొంది. క్రిమినల్ న్యాయవాదులు, న్యాయవ్యవస్థలు, న్యాయాధికారులు, సాధారణ పౌరుల నుంచి అభిప్రాయాలను స్వీకరించలేదన్న విషయం అర్థమవుతోందని ఉదహరించింది.





# తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎకో టూరిజం కార్యక్రమాలు





**హైదరాబాద్, జూన్ 30(నమస్తే ఉదయం):** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎకో టూరిజం కార్యక్రమాలలో భాగంగా ఫారెస్ట్ ట్రెక్ పార్క్ నందు వాన్డేరింగ్ బీ హాలిడేస్ ఆర్గనైజషన్ సహకారంతో నేచర్ క్యాంపు ఏర్పాటు చేసి నిర్వహించడం జరిగింది. ఈ యొక్క నేచర్ క్యాంపు లో హైదరాబాద్ నలుమూలలనుండి 20 మంది పాల్గొన్నారు.

ఈ యొక్క నేచర్ క్యాంపు 29-06-2024 రోజు సాయంత్రం 4 గంటలకు మొదలై నేడు 30-06-2024 రోజున ఉ:.10 గంటలకు ముగిసింది.

ఈ యొక్క నేచర్ క్యాంపులో నిన్న సాయంత్రం 4 గంటలకు బుకింగ్ చేసుకున్నవారందరు పార్క్ లోగల రైన్ ట్రీ రచ్చబండ దగ్గర హాజరు కాగా వారికి ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మానేజర్ కళ్యాణపు సుమన్ మరియు వాండేరింగ్ బీ రంఘవేంద్ర ప్రసాద్ గారు నేచర్ క్యాంపు గురించి జరగబోయే కార్యక్రమాల గురించి వారికి వివరించారు. తర్వాత హైకింగ్ చేస్తూ మర్రిచెట్టు రచ్చబండ దగ్గర ఏర్పాటు చేసిన టీం బిల్డింగ్ కార్యక్రమాలలో ఆసక్తిగా పాల్గొన్నారు. అనంతరం చెక్డాం పాండ్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంపింగ్ సైట్ కి చేరుకొని టెంట్ ఎలా వేసుకోవాలో వారందరికీ డెమో ఇచ్చి వారితోనే టెంట్ ఫిక్సింగ్ చేపియడం జరిగింది. భోజనం చేసిన అనంతరం అందరికి రాత్రి దీపాలు (లాంథర్స్) ఇచ్చి రాత్రి ట్రేక్కింగ్ చేపించడం జరిగింది. ట్రేక్కింగ్ అనంతరం క్యాంపు వద్ద క్యాంపు ఫైర్ ఏర్పాటు చేసి వారిచే వినోదాన్ని పంచె కార్యక్రమాలను చేయిపించడం జరిగింది.

మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు బర్డ్ వాక్ కార్యక్రమం ఏర్పాటు చేసి అందరికి పక్షులను గుర్తించుటకై పక్షుల బొమ్మలు వాటి పేర్లు కలగలిపిన బ్రౌచర్‌లు మరియు వాటి వీక్షణ కొరకై బైనాక్యులర్స్ ఇవ్వడం జరిగింది. ఈ యొక్క బర్డ్ వాక్ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఉదయ్ నీతిపూడి గారు వ్యవహారించి పక్షుల గురించి వివరించారు. కార్యక్రమంలో 14 రకాల పక్షులను వారు తిలకించారు. పిమ్మట పెద్ద చెరువు వద్దకు గుట్టల మీదుగా ట్రేక్కింగ్ చేసి పెద్దచెరువు వద్ద బ్రేక్ఫాస్ట్ చేశారు. అనంతరం అడ్వెంచర్ కార్యమాలలో భాగంగా రివర్ క్రాసింగ్, వాలీ క్రాసింగ్, క్లింబింగ్ వంటి కార్యక్రమాల్లో అందరూ చురుగ్గా పాల్గొన్నారు. ఈ యొక్క నేచర్ క్యాంప్ లో పిల్లలకు వివిధ చెట్ల యొక్క ప్రాముఖ్యతలను తెలియజేయడానికి. పర్యావరణం యొక్క అంశాలు , వాటిని సంరక్షించవలసిన ప్రాముఖ్యత. పిల్లలకు నగరంలోని సహజ/నిర్మిత వనరులపై కూడా అవగాహన కల్పిస్తారని., టి. జి.ఎఫ్.డి.సి. తరుపున ఇక మీదట ప్రతీ వారం ఈ యొక్క ప్రకృతి శిభిరం (నేచర్ క్యాంప్ లు) నిర్వహిస్తామని, ఆశక్తీ గల వారు 9493549399 మరియు 93463 64583 నంబర్లను సంప్రదించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ వివరించారు. రానున్న రోజుల్లో ప్రకృతి పర్యాటకానికి పెద్ద పీట వేసి (మద్యం నిషేధిత) నేచర్ క్యాంపులను ప్రోత్సాహస్తామని పేర్కొన్నారు.

ఈ యొక్క కార్యక్రమంలో ప్లాంటేషన్ మానేజర్ లక్ష్మారెడ్డి, నేచురలిస్ట్ శ్రీకాంత్, అడవెంచర్ ట్రైనర్స్ సతీష్, నరేష్, వంశీ, బాబు, వెంకటేష్ టి. జి. ఎఫ్. డి. సి. సిబ్బంది పాల్గొన్నారు.






మైలార్ దేవుపల్లి ప్రజా పొదుపు సంఘం పక్కన ఉన్న డైరీలోకి దూసుకు వెళ్లిన లారీ, ధ్వంసమైన కారు, ఆటో

# రోడ్డు పక్కన ఉన్న డైరీలోకి దూసుకెళ్లిన లారీ

**రాజేంద్ర నగర్, జూన్30(నమస్తే ఉదయం):** మక్తల్ నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా కాటేదాన్ వైపు ఆదివారం దానా లోడు తో వెళ్తున్న ఏపీ 07 ఎక్స్ ఓ 0369 నెంబర్ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో మైలార్‌దేవుపల్లి ప్రజా పొదుపు సంఘం పక్కనున్న డైరీ ప్రహరీ గోడను ఢీ కొట్టింది. దీంతో ప్రహరీ గోడ పక్కన పార్కు చేసిన టీఎస్ 0 6 8580 నెంబర్ కారు తో పాటు టిఎస్ 09 యుఏ 4223 నెంబర్ ఆటోలపై పడింది.

కారు, ఆటోలో ఆ సమయంలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. విషయాన్ని తెలుసుకున్న మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ని కలిసిన బిజెపి నాయకులు

**రాజేంద్ర నగర్,జూన్30 (నమస్తే ఉదయం):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ని ఆదివారం రాజేంద్ర నగర్ బిజెపి నాయకులు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో బిజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వాసు, వెంకటరెడ్డి, శశికాంత్ శర్మ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.






## మన్ కి బాత్ కార్యక్రమం
# తిలకించిన బిజెపి నాయకులు

**రాజేంద్రనగర్, జూన్ 30(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ ఆదివారం ఉదయం 11 గం లకు 111 వ మన్ కి బాత్ కార్యక్రమం కె నర్సింహ బిజెపి సీనియర్ నాయకుడు ఇంట్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు జి బాబురావు, ఉపాధ్యక్షుడు పవన్ రాజ్,ఎస్ మోర్చ అధ్యక్షుడు తొండుపల్లి మల్లేష్ ,ప్రధాన కార్యదర్శి ఈ వేణుగోపాల్ ,పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.







శ్రమ దానంలో పాల్గొన్న బుద్వేల్ టీచర్స్ కాలనీ సభ్యులు, శ్రమదానంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, కాలనీ వాసులు

# బుద్వేల్ టీచర్స్ కాలనీలో పరిసరాల పరిశుభ్రత

## స్వచ్ఛందంగా పాల్గొన్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

**రాజేంద్ర నగర్, జూన్30(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనీలో ఆదివారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ సహకారంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ పర్యవేక్షణలో టీచర్స్ కాలనీ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అక్కడ నివసిస్తున్న ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చెత్తను ఇంటింటికి వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. నిర్మాణ వ్యర్థా లను రోడ్లపై వేయకూడదన్నారు. ప్రతి నెల ఒకసారి కాలనీ వాసు లంతా కలిసి శ్రమదానం చేసుకున్నట్లయితే కాలనీలో పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లు పెరగవన్నారు. ఈ విషయంలో మున్సిపల్ సిబ్బందికి కాలనీవాసులు సహకారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ ముఖ్య సలహాదారులు ఎ.వెంకటేశ్వర్లు, హానోక్ జయకుమార్, కె.ఎస్ దయానంద్(డేవిడ్) అధ్య క్షులు దేవులపల్లి భాస్కరరావు, ఉపాధ్యక్షులు నర సింహులు, ప్రధాన కార్యదర్శి కె.జగన్మోహన్, సంయుక్త కార్యదర్శి వేణు గోపాల్, కోశాధికారి టి.కృష్ణ, కార్యవర్గ సభ్యులు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.






రోడ్డుకు అడ్డుగా ఉన్న మొక్కలను తొలగిస్తున్న కాలనీ వాసులు, రోడ్డు పక్కన వేసిన మట్టి కుప్పలను ఎత్తుతూ....

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## కాటేడాన్‌లో ఉచిత వైద్య శిబిరం

**రాజేంద్ర నగర్, జూన్30(నమస్తే ఉదయం):** కాటేదాన్ శాంతి నగర్‌లో గల రవి బ్రిలియంట్ హై స్కూల్‌లో ఆదివారం బద్రి విశాల్ ఫన్నాలాల్ పిత్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతు, మానవ సేవనే మాధవ సేవ అన్నారు. పేదలకు ఉచిత సేవ అందించే ఉదేశ్యంతో ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయడం చాలా సంతోషగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్కూల్ సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.



# మైలార్ దేవులపల్లి సీఐగా పి.నరేందర్ బాధ్యతలు స్వీకరణ..

**రాజేంద్రనగర్,జూన్ 30(నమస్తే ఉదయం):** మైలార్ దేవులపల్లి పోలీస్ స్టేషన్ సీఐగా పి.నరేందర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మైలార్ దేవులపల్లి సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.మధు సైబరాబాద్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐగా బదిలి అయ్యారు. సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.నరేందర్‌ను మైలార్ దేవులపల్లి సీఐగా బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మైలార్ దేవులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, ప్రజలకు మెరుగైన న్యాయపమైన సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటానని సీఐ పి.నరేందర్ తెలిపారు.



# ప్రైవేట్ స్కూళ్లలో దండిగా ఫీజులు వసూలు

## వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి నాయకుడు గాడిల నవీన్ డిమాండ్...



**కొత్త కోట,జూన్ 30(నమస్తే ఉదయం):** కొత్తకోట పట్టణంలో ప్రైవేట్ స్కూల్ యజమానులు విద్యార్థుల తల్లితండ్రులతో దండిగా ఫిజులు వసూలు చేయడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళనకు గురి అవుతున్నారని విద్యార్థి నాయకుడు గాడిల నవీన్ పేర్కొన్నారు.2024-2025 విద్యా సంవత్సరం మొదలు కావడంతో పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్డు అదుపు లేకుండా ఇష్టసారంగా విద్యార్థుల తల్లితండ్రులతో దండిగా ఫిజులు వసూలు చేస్తున్నారని వీటిపై విద్యాశాఖ అధికారులు పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మే నెల నుండి జూన్ మాసం మొదటివారం వరకు మా పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని మంచి విద్యను అందించే టీచర్లు ఉన్నారని మైకుల ద్వారా మల్టీకలర్ కరపత్రాలు నుంచి అర్భాటలతో ప్రచారం నిర్వహించారాని ఆయన మండిపడ్డారు, కొన్ని స్కూల్ యాజమాన్యం తమ స్కూల్లో పనిచేసే వారితో ఉదయం సాయంత్రం తేడా లేకుండా ప్రచారం నిర్వహిస్తు మనసు పెట్టి చదివిస్తూ మంచిమార్గంలో నడిస్తున్నాం అంటూ ముద్రించడం జరిగింది అన్నారు, వాస్తవానికి ఫిజులు నిర్ణయించేది ప్రతి పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ ప్రిన్సిపాల్ కలిసి కమిటీ ద్వారా ఈ సంవత్సరం ఒక క్లాసుకు ఇంత పీజు అని అని నిర్వహించి విద్యాశాఖ అధికారి కు ప్రతి పాఠశాల నుండి పీజుల నిర్ణయాని పంపియాలి ఇట్టి నిర్ణయం కూడా స్కూల్ ప్రారంభం ముందే నిర్ణయించుకోవాలి.

## ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం శ్రద్ధ వహించాలి

**- డాక్టర్ రాహుల్ గాంధీ గౌడ్**

**బండ్ల గూడ,జూన్30(నమస్తే ఉదయం):** ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం శ్రద్ధ వహించాలని సేఫ్ హెల్త్ క్లినిక్ డాక్టర్ రాహుల్ గాంధీ గౌడ్ డాక్టర్ శ్వేతా గౌడ్‌లు సూచించారు. ఆదివారం పీరంచెరువు గిరి దారి అపార్ట్మెంట్లో



నిర్వహించిన హెల్త్ క్యాంపులో పాల్గొన్నారు.క్వాలిటీ కేర్ డయాగ్నొస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ రాహుల్ గాంధీ గౌడ్ ఈ ఉచిత హెల్త్ క్యాంపును ఏర్పాటు చేశారు ఈ హెల్త్ క్యాంప్ లో గిర్ధారి అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఇలాంటి ఆరోగ్య సమస్య ఉన్న అశ్రద్ధ వహించకుండా డాక్టర్ను సంప్రదించాలన్నారు. సొంత వైద్యం పనికిరాదన్నారు.



హరిత హారం సందర్భంగా బండ్లగూడ సన్ సిటీలో గొడవ పడుతున్న కార్పొరేటర్లు



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి తదితరులు

# బండ్లగూడ మున్సిపల్ కార్పోరేషన్‌లో మేయర్, మాజీ మేయర్ వర్గీయుల మధ్య భగ్గుమన్న విభేదాలు

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలో ఒకరిపై ఒకరు దాడులు

## పోలీసులకు ఇరు వర్గాలకు చెందిన నాయకుల ఫిర్యాదు

**రాజేంద్రనగర్, జూన్ 30 (నమస్తే ఉదయం):** బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ - మాజీ మేయర్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఆదివారం సన్ సిటీ 6వ వార్డులో జరిగిన హరితహారంలో మొక్కలు నాటు తు ఫోటోలు దిగుతున్న సమయంలో ఒకరిపై ఒకరు దుర్భాషలాడుతూ దాడులు చేసుకున్నారు. ఈ తతంగమంతా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ సమక్షంలోనే జరిగింది. గందలగోళంలో ఎవరిపై ఎవరు దాడి చేశారో తెలియని పరిస్థితి నెలకొంది. చివరకు ఇరు వర్గాల నాయకులు రాజేంద్రనగర్ పోలీసులకు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు వివరాల్లోకి వెళితే......

సన్ సిటీ 6వ వార్డులో ఆదివారం హరితహారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్రతోపాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్ , మాజీ మేయర్ మహేందర్ గౌడ్ , డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మొక్కలు నాటి ఫోటో దిగుతున్న సమయంలో హరీష్ గౌడ్ అనే బీఆర్ఎస్ నాయకుడు మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్‌కు అడ్డుగా నిలబడ్డాడు. ఫొటోలో మేయర్ కనిపించడం లేదు.... కాస్త జరగండి అని హరీష్ గౌడ్‌తో చెప్పడంతో గొడవ మొదలైంది. ఈ గొడవలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

**అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయామనే దాడికి పాల్పడ్డారు: మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్ :**

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ 6వ వార్డు సన్ సిటీలో ఆదివారం హరితహారం కార్యక్రమం ఉందని కమీషనర్ బి.శరత్ చంద్ర చెప్పగా అక్కడికి వెళ్లాం. ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌తో కలిసి మొక్కలు నాటుతుండగా, ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేని మాజీ మేయర్ మహేందర్ గౌడ్ అనుచరులు కొందరు తనకు అడ్డుగా నిలబడితే కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు వారించారు. అడ్డు జరగాలని చెప్పడంతో అవిశ్వాసంలో ఓడిపోయామని ఆక్కసుతో మాజీ మేయర్ మహేందర్ గౌడ్ అనుచరులు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్‌లపై దాడి చేసి గాయపరిచారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసాము.

**తనను కులం పేరుతో దూషించారు : కార్పొరేటర్ చంద్రశేఖర్**

హరితహారంలో పాల్గొన్న తనును కులం పేరుతో దూషిస్తూ గాయపరిచారని కార్పొరేటర్ చంద్రశేఖర్ అన్నారు. మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్‌కు అడ్డుగా నిలబడ్డారని, అడ్డు జరగాలని కోరగా హరీష్ గౌడ్, శివ గౌడ్‌తో పాటు మరికొందరు తనను కులం పేరుతో దూషించారని, దాడి చేసి చొక్కా చింపి వేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాను. తనకు న్యాయం చేయాలి.

**తనపై కూడా దాడి చేశారు : బీఆర్ఎస్ నాయకుడు హరీష్ గౌడ్**

హరితహారంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో కలిసి పాల్గొన్నాను. ఈ సమయంలో తనపై కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు అకారణంగా దాడి చేశారు. అందుకే రాజేంద్రనగర్ పోలీసులకు తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాను.





తనను కులం పేరుతో దూషించి దాడిచేసారని పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ చంద్రశేఖర్, తనను గాయపరిచారని చెబుతున్న శ్రీనాథ్ రెడ్డి



రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బండ్లగూడ మున్సిపల్ కార్పోరేషన్ నాయకులు

## కాటేడాన్‌లో ఉచిత వైద్య శిబిరం

**రాజేంద్ర నగర్, జూన్30(నమస్తే ఉదయం):** కాటేదాన్ శాంతి నగర్‌లో గల రవి బ్రిలియంట్ హై స్కూల్‌లో ఆదివారం బద్రి విశాల్ ఫన్నాలాల్ పిత్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శిబిరాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు, మానవ సేవనే మాధవ సేవ అన్నారు. పేదలకు ఉచిత సేవ అందించే ఉదేశ్యం తో ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయడం చాలా సంతోషగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్కూల్ సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.

## బండ్లగూడ సన్ సిటీలో హరితహారం

**రాజేంద్రనగర్, జూన్30(నమస్తే ఉదయం):** బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్ సిటీ పీ అండ్ టీ కాలనీలో ఆదివారం హరితహారం కార్యక్రమం జరిగింది. వన మహోత్సవం కార్యక్రమంలో రాజేంద్రనగర్



హరితహారం కార్యక్రమంలో సన్ సిటీలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, తదితరులు


ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పాల్గోని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చదనం పెరిగితేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు. ప్రతిఒక్కరు పచ్చదనం పెంచే దిశగా అడుగులు వేయాలని సూచించారు. బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో హరితహారం పేరుతో నిర్వహించిన కార్యక్రమం చాలా సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో హరితహారంలో దేశానికి ఆదర్శగా నిలిచామని గుర్తు చేసారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కమీషనర్, కాలనీ వాసులు ఉన్నారు.



## బిజెపి పార్టీ నాయకులతో కలిసి ప్రధాని మోదీ మన్ కీ బాత్ వీక్షిస్తున్న తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్,జూన్30(నమస్తే ఉదయం):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఉదయం 11 గంటలకు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేశారు.మూడోసారి ప్రధాని భాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారిగా మోదీ మన్ కీ బాత్ పేరిట ప్రసారమాధ్యమాల ద్వారా ప్రసంగించారు.ఈ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బిజెపి నాయకులు ప్రజలకు వినిపించేలా టీవీలు పెట్టి ప్రధాని మోదీ 'మనకి బాత్' కార్యక్రమాన్ని చేపట్టారు.అన్ని శక్తి కేంద్రాల్లో నరేంద్ర మోడీ ప్రసంగాన్ని మన్ కీ బాత్ ద్వారా వినిపించారు. మైలార్ దేవులపల్లి డివిజన్ కాటేదాన్ బిజెపి కార్యాలయంలో ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ తొలి సారి ( మాన్ కీ బాత్) కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వీక్షించడం జరిగింది.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ...దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్ళి ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరే విధంగా పనిచేయాలన్నారు.

మోడీ నాయకత్వంలో ప్రపంచంలోనే అన్ని రంగాల్లో దేశాన్ని విశ్వ గురువు తీర్చి దిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.అదే విధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం అన్న రంగాల్లో ఆదర్శవంతమైన రాష్ట్రంగా అవతరించిందన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆడికే జనార్ధన్, రావుల భాస్కర్, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,మధుసూధన్ రెడ్డి,బబ్లూ, తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లోని శ్రీ మాతా పోచమ్మ దేవాలయం



దేవాలయంలో కొలువుదీరిన శ్రీ మాత పోచమ్మ అమ్మ వారు

# నేడు రాజేంద్రనగర్ శ్రీ పోచమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవాలు

**రాజేంద్రనగర్, జూన్30(నమ స్తే ఉదయం):** రాజేంద్రనగర్ లోని శ్రీ మాతా పోచమ్మ అమ్మవారి దేవాలయ 17వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో పురాతనమైన ఈ దేవాలయాన్ని 17 సంవత్సరాల క్రితం తిరిగి భక్తుల సహకారంతో పునర్ నిర్మించుకోవడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం 7:30 గంటలకు అభిషేకాలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమై, ఉదయం 10 గంటలకు కుంకుమార్చన, సహస్రనామ పారాయణం నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, రాజేంద్రనగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా అన్నదానాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.




## అక్టోబర్ 10న ‘కంగువ’

స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ ‘కంగువ’ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీని అక్టోబర్ 10 దసరా పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ‘కంగువ’ చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘కంగువ’ సినిమాను హ్యూజ్ బడ్జెట్ తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ‘కంగువ’ నుంచి ఇప్పటిదాకా రిలీజ్ చేసిన సిజిల్ టీజర్, పోస్టర్స్ సినిమా మీద క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నాయి. పీరియాడిక్ యాక్షన్ జానర్ లో ఇప్పటిదాకా తెరపైకి రాని ఒక కొత్త కాన్సెప్ట్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతోంది సినిమా. పది భాషల్లో తెరకెక్కుతున్న ‘కంగువ’ త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. పలు అంతర్జాతీయ భాషల్లోనూ ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో బిగ్గెస్ట్ మూవీగా ‘కంగువ’ సినిమాపై అటు ట్రేడ్ వర్గాల్లో, ఇటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి.




## ప్రభాస్..స్పిరిట్ మార్చాల్సిందే?

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన పాన్ వరల్డ్ మూవీ కల్కి 2898ఏడీ థియేటర్స్ లోకి వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అద్భుతమైన కలెక్షన్స్ తో ఈ మూవీ దూసుకుపోతోంది. వీకెండ్ పూర్తయ్యేనాటికి 500ం కోట్లు కలెక్షన్స్ సాధించడం గ్యారెంటీ అనే మాట ట్రేడ్ పండితుల నుంచి వినిపిస్తోంది. ఇదిలా ఉంటే కల్కి మూవీ వైబ్ కనీసం రెండు వారాల పాటు నడిచే అవకాశం ఉంది. దీని తర్వాత ప్రభాస్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ మూవీ చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాదిలోనే మూవీ షూటింగ్ స్టార్ట్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. కల్కి సినిమా సూపర్ హిట్ దిశగా దూసుకుపోతూ ఉండటంతో సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ పైన కూడా అంచనాలు పెరిగాయి. యానిమల్ సినిమాతో సందీప్ రెడ్డి వంగా గత ఏడాది బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. దీంతో స్పిరిట్ మూవీకి కూడా సందీప్ రెడ్డి వంగా కచ్చితంగా బెస్ట్ అవుట్ ఇస్తాడని డార్లింగ్ ఫ్యాన్స్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఈ చిత్రాన్ని టి-సిరీస్, సందీప్ రెడ్డి వంగా కలిసి నిర్మించబోతున్నారు. డార్లింగ్ ప్రభాస్ కెరియర్ ఇప్పటి వరకు చేయనటువంటి పోలీస్ ఆఫీసర్ రోల్ ని స్పిరిట్ చిత్రంలో చేయబోతున్నాడు. కథ కూడా చాలా పవర్ ఫుల్ గా ఉంటుందంట. సందీప్ రెడ్డి సినిమాలలో హీరో క్యారెక్టరైజేషన్ చాలా వైలెంట్ గా ఉంటుంది. స్పిరిట్ మూవీలో కూడా ప్రభాస్ పాత్ర అలాగే ఉండబోతోందంట. రీసెంట్ గా సందీప్ రెడ్డి, ప్రభాస్ మీట్ అయ్యారంట. ఈ సందర్భంగా సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్ నుంచి డిస్కషన్ జరిగినట్లు తెలుస్తోంది.



## అప్పుడు తెలియక తప్పు చేశాను


సమంత హీరోయిన్‌గా ఈ అమ్మడు సంపాదించుకున్న స్టార్‌డమ్ మాములుది కాదు. కెరీర్ తొలినాళ్ల నుంచి వరుస విజయాలను అందుకుంది. అగ్ర హీరోయిన్లలో ఒకరిగా పేరు సంపాదించుకుంది. అనంతరం నాగ చైతన్యతో వివాహం చేసుకున్న తర్వాత కూడా సినిమాలను కొనసాగించింది. హీరోయిన్‌గా వరుస అవకాశాలు దక్కించుకుంటున్న సమయంలోనే నాగ చైతన్యతో విడాకులు, ఆ తర్వాత మయోసైటిట్ వ్యాధి బారిన పడింది. దీంతో సినిమాలకు చాలా గ్యాప్ ఇచ్చింది సామ్. ప్రస్తుతం సామ్ చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. అయితే ఇటీవలే ఓ వెబ్ సిరీస్‌కు ఈ బ్యూటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే సినిమాలు లేకపోయినా సోషల్ మీడియా ద్వారా నిత్యం అభిమానులతో టచ్ ఉండే సామ్, ఫ్యాన్స్ అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. గతంలో తాను ఓ విషయంలో తెలియక తప్పు చేశానని చెప్పుకొచ్చింది. గతంలో సమంత కొన్ని అనారోగ్యకరమైన బ్రాండ్స్‌ని ప్రమోట్ చేసిన విషయమై అభిమాని ప్రశ్నించాడు.

దీనికి బదులిచ్చిన సమంత.. గతంలో తాను తప్పులు చేసిన మాట వాస్తవమేనని, అయితే అన్నవీ పూర్తిగా తెలియక చేసినవని చెప్పుకొచ్చారు. అయితే అసలు విషయం తెలుసుకున్న తర్వాత ప్రమోషన్స్ చేయడం ఆపేశానని తెలిపారు. ఇప్పుడు తాను ఏం చేస్తుందో వాటి గురించి మాత్రమే చెబుతున్నాని సమాధానం ఇచ్చారు.

## ‘కల్కి 2898 ఎడి’ విజయం

# గొప్ప ఆనందాన్ని ఇచ్చింది

**విజనరీ ఫిల్మ్ మేకర్ నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన సైన్స్ ఫిక్షన్ ఎపిక్ మాగ్నం ఓపస్ ‘కల్కి 2898 ఎడి’. ఈ విజువల్ వండర్ లో ఇండియన్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె లీడ్ రోల్స్‌లో నటించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత సి. అశ్వనీదత్ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. మైథాలజీ -ఇన్స్ స్పైర్డ్ సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ ‘కల్కి 2898 ఎడి’ జూన్ 27న గ్రాండ్ గా విడుదలై ప్రపంచ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షులని మహా అద్భుతంగా అలరించి, యునానిమాస్ ఎపిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకొని, రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్ తో హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో నిర్మాత సి. అశ్వినీదత్ విలేకరుల సమావేశంలో ‘కల్కి 2898 ఎడి’ విశేషాలని పంచుకున్నారు.**



**కల్కి 2898 ఎడిపై మీ అంచనాలు ఏమిటి? మీ అంచనాలకి తగ్గ రిజల్ట్ ఎలా వచ్చింది? ఎంత హ్యాపీగా వున్నారు ?**

చాలా చాలా హ్యాపీగా వున్నాను. నిన్న మార్నింగ్ షో నుంచే.. తెలుగు రాష్ట్రాలు, ముంబై, మద్రాస్, బెంగళూరు, ప్రపంచవ్యాప్తంగా రెవల్యూషనరీ రిపోర్ట్ వచ్చింది. నేను ఏదైతే అనుకున్నానో అలాంటి అఖండ విజయం వచ్చింది. హ్యాట్సప్ టు నాగ్ అశ్విన్. ఐయామ్ వెరీ వెరీ హ్యాపీ.

**నాగ్ అశ్విన్ గత రెండు సినిమాలు చాలా సెన్సిబుల్ గా వుంటాయి. తను ఇలాంటి వైల్డ్ డెప్త్ వున్న సబ్జెక్ట్ ని హ్యాండిల్ చేయగలడనే కాన్ఫిడెన్స్ మీకు ఎప్పుడు వచ్చింది?**



-తన మొదటి సినిమా నుంచి తనతో జర్నీ చేస్తున్నాం. తను ఎంత పెద్ద సినిమా అయినా తీయగలడనే కాన్ఫిడెన్స్ నాకు మొదటి నుంచి వుంది. అదే మా అమ్మాయిలతో చెప్పాను. తను ఏ సబ్జెక్ట్ చెప్పినా వెంటనే దూకేయమని అన్నాను. ఈ శతాబ్దంలో ఒక దర్శకుడు మా ఇంట్లోనే దొరికాడు( నవ్వుతూ).

- నా మొదటి సినిమా ఎదురులేని మనిషి నుంచి ఇప్పటివరకూ దర్శకుడు చెప్పింది వినడం, తనకు కావల్సినది సమకూర్చడం తప్పా మరో డిస్కర్షన్ పెట్టను. ఇది అందరికీ తెలుసు.

కల్కి 2898 ఎడి మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఇంకా ఏం కావాలని అడగడం తప్పా నేను ఎప్పుడు ఎక్కడ ఇంటర్ఫియర్ కాలేదు.

**అమితాబ్‌ని నాగ్ అశ్విన్ చాలా అద్భుతంగా చూపించారు కదా.. ఆయన్ని అలాంటి పాత్రలో చూడటం మీకు ఎలా అనిపించింది ?**

డైరెక్టర్‌గారు ఏం అనుకున్నారో అలానే తీస్తారని తెలుసు, అలానే తీశారు కూడా. హ్యాట్సప్ టు హిమ్.

**అమితాబ్ గారు, నిర్మాతగా మీకు గౌరవం ఇస్తూ మీ కాళ్ళకి నమస్కారించినప్పుడు మీ ఫీలింగ్ ఏమిటి ?**

నాకు తలకాయ కొట్టేసినంత పనైయింది (నవ్వుతూ). మేము కలిసినప్పుడు పరస్పరం నమస్కరించుకుంటాం. అక్కడితో ఆగిపోతాం. అయితే స్టేజ్ మీద మాత్రం ఆయన అలా చేయడం నేను అస్సల్ ఊహించలేదు. అమితాబ్ గారు లెజెండ్. హ్యాట్సప్ టు హిమ్.

**ఇందులో ‘బుజ్జి’ (కారు) ని కూడా ఒక పాత్ర చేశారు.. ఈ ఆలోచన చెప్పినపుడు ఎలా అనిపించింది ?**

ఇదంతా నాగ్ అశ్విన్ విజన్. ఈ కాన్సెప్ట్ గురించి చెప్పినప్పుడు చాలా అద్భుతంగా అనిపించింది. సినిమాలో చాలా గొప్పగా ప్రజెంట్ చేశారు.

**ఈ కథ అనుకున్నప్పుడే పార్ట్ 2 ఐడియా ఉందా ?**

అవునండీ. ఈ స్టోరీ అనుకున్నప్పుడే పార్ట్ 2 థాట్ వచ్చింది. కమల్ ఎంటరైన తర్వాత పార్ట్ 2 డిసైడ్ అయిపోయాం. కమల్‌ది అద్భుతమైన పాత్ర.

**పార్ట్ 2 రిలీజ్ ఎప్పుడు?**

ఇప్పుడే ఏం తెలీదండి. నెక్స్‌ట్ ఇయర్ సమ్ వేర్ ఈ టైంలోనే రావచ్చు.

**వైజయంతీ మూవీస్ నుంచి రాబోయే సినిమాలు గురించి?**

శ్రీకాంత్ అబ్బాయితో ఓ సినిమా వుంటుంది. అలాగే దుల్కర్ సల్మాన్‌తో ఓ సినిమా చేస్తున్నాం.



## వేట్టాయన్‌తో సేనాపతి

యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ జులై 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఇండియన్ 2 సినిమాను లైకా ప్రొడక్షన్స్ వారు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. అయిదు సంవత్సరాలుగా ప్రేక్షకులు ఇండియన్ 2 కోసం ఎదురు చూస్తున్నారు. తెలుగులో భారతీయుడు 2 టైటిల్ తో రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.

దేశ వ్యాప్తంగా చిత్ర యూనిట్ సభ్యులు ముఖ్యంగా కమల్ హాసన్, సిద్ధార్థ్, శంకర్‌లు చక్కర్లు కొడుతో ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న విషయం తెల్సిందే. ప్రమోషన్ లో భాగంగా లైకా ప్రొడక్షన్స్ వారు ఈ ఫోటోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేయడం జరిగింది. భారతీయుడు 2 స్టార్ సేనాపతితో వెట్టైయన్ స్టార్ రజినీకాంత్ కలిసిన ఈ ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇండియన్ 2 మరియు వెట్టైయన్ సినిమాలను లైకా ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న విషయం తెల్సిందే. అందుకే లైకా ప్రొడక్షన్స్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుందర్ రాజన్ ఇద్దరు సూపర్ స్టార్స్ తో కలిసి ఫోటో దిగాడు. ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్స్ ను ఒకే ఫ్రేమ్ లో చూడటంతో ప్రేక్షకులు మరియు ఫ్యాన్స్ సర్‌ప్రైజ్ అవుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## “కూర్మనాయకి” ప్రాజెక్ట్‌లోకి వెల్కమ్ చెప్పిన టీమ్



టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మరో భారీ సోషియో ఫాంటసీ మూవీ “కూర్మనాయకి”. ఈ చిత్రాన్ని ఎంఎం క్రియేషన్స్, కాలభైరవ ప్రొడక్షన్స్ తో కలిసి రోషన్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో కె విజితా రావ్ నిర్మిస్తున్నారు.

స్నిగ్ధ మణికాంత్ రెడ్డి, పూజ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటిదాకా రానటువంటి కథా కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు హర్షవర్ధన్ కడియాల. వరలక్ష్మీ శరత్ కుమార్, సాయి కుమార్, అతిరారాజ్, వీటీవీ గణేష్ కీ రోల్స్ లో నటిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ శివాజీ ఓ ప్రధాన పాత్రను పోషించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌లోకి వెల్కమ్ చేస్తూ స్పెషల్ వీడియో రిలీజ్ చేసింది కూర్మనాయకి టీమ్. శివాజీ ఈ చిత్రంలో పవర్ ఫుల్ రోల్ చేస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తోంది.


**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. “RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.